నత్తనడకన పనులు!



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామ పంచాయతీ పరిధిలో గల చింతగూడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాల. ఇక్కడ పాఠశాల మరమ్మతుల కోసం రూ. 2.25 లక్షలు మంజూరయ్యాయి. పాఠశాల గదిలో టైల్స్ వేసినప్పటికీ తాగునీటి నల్లాలు ఇంకా బిగించలేదు. అలాగే భవనానికి కలర్, ఇతర మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.



ఈఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామ పంచాయతీ పరిధిలోని సిరికొండ గ్రామంలోని టీడబ్ల్యూపీఎస్ పాఠశాల విద్యార్థులు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు భవనం మరమ్మతుల కోసం ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కింద రూ. 2.60 లక్షలు మంజూరు చేసింది. పనులు నత్తనడక కొనసాగుతుండడంతో విద్యార్థులు నేలపై కూర్చొని పాఠాలు వింటున్నారు.

- ముందుకు సాగని అమ్మఆదర్శ పాఠశాల పనులు
- 42 పాఠశాలలకు రూ. 1.04 కోట్లు మంజూరు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే మండలంలోని ప్రతీ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో మరమ్మతులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రణాళికలు రూపొందించిన అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపడంతో నిధులు సైతం మంజూరు చేసింది. పనుల బాధ్యతలను ఆయా గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగించింది. ఇక్కడి వరకు బాగానే ఉంది. కానీ దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించాడు అనే చందంగా మారింది టీడబ్ల్యూపీఎస్ పాఠశాలల మరమ్మతుల పని తీరు.

రూ. 1.04 కోట్లు..

మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా.. 42 టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో తాగునీటి సౌకర్యంతో పాటు భవన మరమ్మతులు, ఇతర మరమత్తుల కోసం రూ. 1,04,65,000 మంజూరు చేసింది. ఒక్కొక్క పాఠశాలకు ఒక్కొక్క విధంగా అమౌంట్ మంజూరు చేసింది. అందులో రూ. 1.60 లక్షలు మూడు పాఠశాలలకు, రూ. 2.25 లక్షలు 10 పాఠశాలలకు, రూ. 2.95 లక్షలు 3 పాఠశాలలకు, రూ. 3.60 లక్షల చొప్పున మంజూరు కాగా పనుల్లో జాప్యం జరుగుతోంది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. ఇంకా మరమ్మతు పనులు కొనసాగుతునే ఉన్నాయి.

నేలపై కూర్చొని..

పాఠశాలల మరమ్మతులు సకాలంలో పూర్తి కాకపోవడంతో మండలంలోని కొన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో నేలపై కూర్చొని పాఠాలు వింటున్నారు. పనుల్లో వేగం పెంచకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

‘రైతుల జోలికి వస్తే ఊరుకోం’



నివాళులర్పిస్తున్న తిరుపతి, శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రైతుల జోలికి వస్తే ఊరుకోమని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్ గూడ గ్రామంలో జరిగిన చేరికల కార్యక్రమానికి గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, జిల్లా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా కుమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతన కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. గ్రామంలోని శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పేదల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, షేక్ ఖలీద్, బొమ్మకంటి రమేశ్, బూర్ల శంకరయ్య, బండి దేవిదాస్ చారి, సుధాకర్ గౌడ్, భోజా రెడ్డి, అరిగేల కిష్టయ్య, అయిటి నర్సింగ్, భూమయ్య పాల్గొన్నారు.

‘కేంద్రానివి ప్రజావ్యతిరేక విధానాలు’



నిరసన తెలుపుతున్న నాయకులు

ఎదులాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో బుధవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విదేశీ సంస్థలకు దేశాన్ని తాకట్టు పెడుతోందని ఆరోపించారు. జాతి సంపదను లూటీ చేస్తోందని మండిపడ్డారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఐక్యంగా పోరాడడానికి కార్మికులు, కర్షకులు సన్నద్ధం కావాలన్నారు. లేబర్ కార్డు నోటిఫికేషన్ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. గిట్టుబాటు ధరల చట్టం హామీని కేంద్రం విస్మరించిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, నాయకులు పోచన్న, నర్సింగ్, సిర్రా దేవేందర్, చిల్కా దేవిదాస్, రాజు, ఆశన్న పాల్గొన్నారు.

రేపు సామూహిక వరలక్ష్మి వ్రతాలు



మాట్లాడుతున్న సిద్ధాంతి చిక్కిలి వెంకటేశ్వర శాస్త్రి

ఆదిలాబాద్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఈనెల 16న సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ప్రముఖ సిద్ధాంతి చికిలి వెంకటేశ్వర శాస్త్రి తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో బుధవారం మాట్లాడారు. ప్రతీ సంవత్సరం శ్రావణమాసంలోని పవిత్ర శుక్రవారాన్ని పురస్కరించుకొని సమితి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం శ్రీరామచంద్ర గోపాల కృష్ణ మఠంలో ఉదయం 10 గంటలకు 311 మంది మహిళలతో వరలక్ష్మి వ్రతం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి గెడం మాధవ్, సభ్యులు రేణిగుంట రవీందర్, పడకంటి సూర్యకాంత్, కొత్తపెల్లి సంజీవ్, మాలతి, నిర్మల, రమ, కృష్ణవేణి, రాజశ్రీ, కల్యాణి, పద్మా, రుక్మిణి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారి శ్రీకాంత్

తలమడుగు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక ఆరోగ్యం, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మద్యానికి, పొగాకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అవరోధించాలంటే ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలన్నారు. స్పష్టమైన లక్ష్యంతో ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని అన్నారు. ఒత్తిడిని అధిగమించి సమస్యలను దాటాలని సూచించారు. మత్తుకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావద్దు

తాంసి: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. పొగాకు, డ్రగ్స్, మద్యం తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి, కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు సంతోష్, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ హసీబుల్లా అన్నారు. ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, నియంత్రణపై ఆర్టీసీ ఉద్యోగులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. మోసానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటం ఏర్పాటు చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీంరావ్ వాఘ్మరే కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్రపటాలు ఏర్పాటు చేసేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయాలన్నారు.

జీపీ భవనానికి స్థలం దానం

బేల: మండలంలోని ఏకోరి గ్రామ పంచాయతీ కార్యాలయం భవన నిర్మాణానికి బుధవారం మాజీ సర్పంచ్ నైతం నానుబాయి సీతరాంలు స్థలాన్ని గ్రామ పెద్దల సమక్షంలో దానం చేశారు. స్థలానికి సంబంధించిన బాండ్ పత్రాలను పంచాయతీ కార్యదర్శి రవికిరణ్‌కు అందజేశారు. ప్రమోద్ మీసవార్, రామెల్లి రాజరాం, గంగారెడ్డి పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

సిరికొండ: మండల కేంద్రంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. బుధవారం మండల కేంద్రానికి చెందిన నలుగురిపై దాడి చేసి గాయపరిచింది. దీంతో ప్రజలు భయాందోళన చెందారు. గ్రామస్తులందరూ కలిసి పిచ్చికుక్కను చంపేశారు.

పరామర్శ

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన గోక సంజీవరెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఘనంగా ‘హర్ ఘర్ తిరంగా’



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తాంసి: భీంపూర్ మండలంలోని గోముత్రి గ్రామంలో బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిఒకరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ నాయకులు ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నారాయణ యాదవ్, నాయకులు తుడి అశోక్, శంకర్, సంజూ, ప్రమోద్, దశరథ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పురవీధుల గుండా జాతీయ జెండాలను చేతబూని ర్యాలీ చేపట్టారు. హిందూ సంఘాల ఆధ్వర్యంలో తిరంగా యాత్ర చేపట్టడంతో పండుగ వాతావరణం నెలకొంది.

బోథ్: బోథ్ మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు బుధవారం నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి, ఇంటింటికీ జాతీయ జెండాలు పంపిణీ చేశారు. మహనీయుల విగ్రహాలను శుద్ధి చేశారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు రమణ, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడుగు అశోక్ రెడ్డి, బోరె రవీందర్, చాబంతుల కృష్ణ, సుభాష్ సూర్య, జక్కుల వెంకటేశ్, భోజన్న, కదం ప్రశాంత్, రంజిత్, సుందల్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

బజార్‌హత్నూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై, మైనార్టీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ అధ్వర్యంలో బంద్ నిర్వహించారు. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. దుకాణాలను మూసిఉంచారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్, భోజారెడ్డి, అల్కే గణేష్, నానం రమణ, కొత్త శంకర్, చట్ల ఉత్తం, సూది నంది నర్సయ్య, మహేశ్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యాభివృద్ధికి కృషి

ఉట్నూర్‌రూరల్: విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి. ప్రతాప్‌సింగ్ అన్నారు. బుధవారం ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకుల సహాయంతో ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నర్సింగ్‌రావు, స్వామి, సాయి, ప్రసాద్, రాణి, రవీందర్, రాజశేఖర్, కిషన్ శ్రీనివాస్, అనిత పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) నూతన కార్యవర్గాన్ని బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా పెర్క గంగమ్మ, ప్రధాన కార్యదర్శిగా దుర్గం కళావతి, ఉపాధ్యక్షులుగా మెస్రం లక్ష్మి, సహాయ కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా తారబాయి, గీత, సునీత, రాణి, కృష్ణవేణి, వర్ష, నీలమ్మలను ఎన్నుకున్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. గృహహింస చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

తలమడుగు: ప్రజలకు నిరంతంగా విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని విద్యుత్ ఏఈ సతీష్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మాట్లాడారు. వర్షాకాలంలో గ్రామీణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా విద్యుత్ వినియోదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలన్నారు. కొత్తూరు గ్రామంలో విత్యుత్ మరమ్మతులు చేసి విద్యుత్‌ను సరాఫరా చేయడం జరిగిందన్నారు. మండలంలో ఎక్కడైన విద్యుత్ సమస్య ఉన్నట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌కు నిధులు మంజూరు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని చిల్కూరిలక్ష్మినగర్ కాలనీలో గల పట్టణ ఆరోగ్య కేంద్రం (అర్బన్ హెల్త్ సెంటర్)కు పక్కా భవనం మంజూరైంది. ప్రస్తుతం ప్రైవేట్ భవనంలో కొనసాగుతుండగా.. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందించడంతో పాటు అద్దెకష్టాలు తొలగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ద్వారా రూ.1.43 కోట్లు విడుదల చేసింది. ఈనిధులతో జీ ప్లస్‌తో కూడిన భవనాన్ని నిర్మించనున్నారు. అయితే కాలనీలో భవన నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన ప్రభుత్వ స్థలం అందుబాటులో లేదు. పైగా ప్రైవేట్ భవనంలో ఆరోగ్య కేంద్రం కొనసాగుతోంది. పక్కనే ఉన్న జైవాన్‌నగర్ కాలనీలో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించేందుకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే చిల్కూరి లక్ష్మినగర్‌లో నిర్మించేందుకు ప్రభుత్వం సూచించిన భవన నమూనాకు స్థలం సరిపోకపోవడంతో దాని ప్లాన్ మార్చేలా బల్దియా అధికారులు ప్రయత్నిస్తున్నారు. అందుబాటులో ఉన్న స్థలంలో భవనాన్ని నిర్మించేందుకు వీలుగా ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రభుత్వం అనుమతి లభించిన వెంటనే టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభిస్తామని బల్దియా ఇంజనీర్ తిరుపతి తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: పేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఆర్థికంగా ఎంతగానో దోహదపడుతోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు రూ. 5 లక్షల 51 వేల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు సుగుణ, అజీం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

మండలంలోని వడ్గల్‌పూర్(కె) గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తూ.. ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యేను గ్రామస్తులు సన్మానించారు. తమ గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సవాలకు నిధులు విడుదల చేయాలి

ఈనెల 29, 30 తేదీల్లో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పట్నాపూర్ గ్రామంలో నిర్వహించే సద్గురు పూలాజీ బాబా జయంతి ఉత్సవాలకు నిధులు మంజూరు చేయాలని ఆంధ్ ఆదివాసీ సంఘ నాయకులు కోరారు. బుధవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్ ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని తాంసి, తలమడుగు మండలాల ఆయా గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రుల ఖర్చుల నిమిత్తం పేదవారికి సీఎంఆర్ఎఫ్ గ్రాంట్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. రెండు మండలాల్లో 13 మంది లబ్ధిదారులకు రూ. 6,80,000 విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ జాన్సన్ నాయక్, మండల కన్వీనర్ తోట వెంకటేశ్, కేదారేశ్వర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, కిరణ్ కుమార్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఎస్సైలకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఇటీవల ఇద్దరు ఎస్సైల బదిలీ అయ్యారు. బజార్‌హత్నూర్ ఎస్సైగా పని చేస్తున్న నరేశ్ నిజామాబాద్ జిల్లా ఎరగట్ల పోలీస్‌స్టేషన్‌కు, బోథ్ ఎస్సై రాముకు బాల్కొండ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కాగా బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి శాలువాతో సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, తాము పనిచేసిన చోట మంచి గుర్తింపు తెచ్చుకున్న వారిని ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని తెలిపారు.

బోథ్: బదిలీపై నిజామాబాద్ వెళ్తున్న బోథ్ ఎస్సై రామును బోథ్, సొనాల, ధన్నూర్‌తో పాటు పలు గ్రామాల ప్రజలు బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రజలతో మేకమయ్యారని, స్నేహపూర్వకంగా ఉండేవారని అన్నారు. కార్యక్రమంలో మీర్ ఇర్షాద్ అలీ, మధు, నవీన్, ఇమ్రాన్, జమీర్, సుధాకర్, జుబేర్, మహేందర్, సురేందర్, వినయ్, రాకేశ్, రమణ గౌడ్ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏఎస్సైలు చారి, లింబాజీ

ఇచ్చోడ: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఏఎస్సైలు చారి, లింబాజీనాయక్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా యువతతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మద్యం సేవించి, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దన్నారు. వాహనాలకు సంబధించిన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్ కాల్ వస్తే వ్యక్తిగత సమచారం ఇవ్వవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు జాతీయ జెండా అందజేత

నేరడిగొండ: హర్ ఘర్ తిరంగా 3.0లో భాగంగా కేంద్ర పర్యాటక, సంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో బుధవారం ఎమ్మెల్యేను కలిసి జాతీయ జెండాతో పాటు మెమోంటో అందజేశారు. జిల్లా తపాలా అధికారులు దేవిరెడ్డి సిద్దార్థ, రాజేశ్, మహేశ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

చిన్నారిని ఆదుకోవాలి

ఇంద్రవెల్లి: మండలంలోని డొంగర్‌గాం గ్రామానికి చెందిన సంతోష్, స్వప్న పిడుగపడి మృతి చెందడంతో అనాథ చిన్నారిని ఆదుకోవాలని తుడుందెబ్బ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోర్ పుష్పరాణి కోరారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డొంగర్‌గాం గ్రామస్తులు పెందోర్ అర్జున్, అనక రాము, కుడ్మేత జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

జోగు రామన్నకు పలువురి పరామర్శ

జైనథ్: మాజీ మంత్రి జోగు రామన్నను పలువురి నేతలు పరామర్శించారు. బుధవారం దీపాయిగూడ గ్రామంలోని ఆయన స్వగృహంలో జోగు రామన్నను కలుసుకొని, అతని సోదరుడు జోగు పోతారెడ్డి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, కోనేరు కోనప్ప, మాజీ ఏపీసీసీ సభ్యులు గండ్రత్ సుజాత ఉన్నారు.

‘ఆంక్షల పేరుతో ఇబ్బంది పెట్టవద్దు’

సిరికొండ: మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన రిమ్మ, రాజంపేట్, లచ్చిపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లోని అభివృద్ధి పనులను అటవీశాఖ అధికారులు ఆంక్షల పేరుతో అడ్డుకుంటున్నారని ఏజెన్సీ నాయకులు ఆరోపించారు. బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. బురదమయమైన రోడ్లకు మొరం వేయకుండా అడ్డుకుంటున్నారని, నీటి కోసం బోర్లు వేయనివ్వడం లేదని మండిపడ్డారు. ,రెవెన్యూ భూమిలో కూడా మామిడి చెట్లు పెట్టనివ్వడం లేదన్నారు. కార్యక్రమంలో పెందుర్ అనిల్ కుమార్, గుణవంత్ రావు, నాగోరావ్, ప్రభు, షేక్ ఇమామ్, మాధవ్‌రావు పాల్గొన్నారు.

‘విమర్శలు మాని.. అభివృద్ధి చేయాలి’

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి జోగు రామన్నను విమర్శించడం మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ జిల్లా ప్రజలకు ఏం చేస్తుందో నిరూపించాలని, అనేక కేసుల్లో కాంగ్రెస్ నాయకులు ఇరుక్కొని నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో సాజిదొద్దీన్, క్రాంతి రాజు, బట్టు సతీష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

కైలాస్‌నగర్: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ.. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆదిలా బాద్ పట్టణంలోని స్థానిక కలెక్టర్‌చౌక్ నుంచి ఎన్టీఆర్ చౌక్ వరకు సాగింది. నాయకులు ఫయాజ్, రఫీక్, సంజయ్ రెడ్డి, ప్రేమల, షబీన పాల్గొన్నారు.